# ఇసుక అమ్మకాలకు కొత్త పాలసీ

- 25% ఇసుక అక్రమ రవాణా
- 48 గంటల్లో అధికారులు పద్ధతి మార్చుకోవాలి
- విజిలెన్స్ ఏసీబీ విభాగాలతో తనిఖీలకు ఆదేశం
- రెండ్రోజుల్లో రంగంలోకి విజిలెన్స్
- గనులు, భూగర్భ ఖనిజ వనరులశాఖపై సీఎం సమీక్ష
- 'నమస్తే తెలంగాణ' కథనానికిస్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): 'ఇసుక ధర డబుల్' పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. గురువారం సచివాలయంలో గనులు, భూగర్భ ఖనిజ వనరులశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇసుక దందాకు కళ్లెం వేయాలని నిర్ణయించారు. ఇసుక అమ్మకాలకు కొత్త విధానం రూపొందించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం ఏపీ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇసుక క్వారీయింగ్, ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని ఆదేశించారు. 48 గంటల్లో అన్ని స్థాయిల్లో అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని డెడ్‌లైన్ విధించారు. రెండు రోజుల తర్వాత విజిలెన్స్, ఏసీబీ విభాగాలను రంగంలోకి దింపాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో వెంటనే తనిఖీలు చేపట్టాలని, బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని చెప్పారు. ఈ నెల 3రవాణా నిజామాబాద్, వరంగల్ రూట్‌లో 83 ఇసుక లారీలను తనిఖీ చేస్తే, 22 లారీలకు అనుమతి లేదని గుర్తించారని, ఒకే పర్మిట్, ఒకటే నంబర్‌తో నాలుగైదు లారీలు ఇసుక రవాణా చేస్తున్నట్టు బయటపడిందని తెలిపారు. ఈ లెక్కన 25 శాతం అక్రమంగా ఇసుక తరలిపోతుందని చెప్పారు. టీఎస్‌ఎండీసీ కేంద్రంగా జరుగుతున్న అక్రమాలను అరికట్టి, గనులు, భూగర్భ వనరుల విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే ఎఫెక్ట్

## అనుమతి లేని క్రషర్స్ సీజ్ చేయండి

హైదరాబాద్ చుట్టుపక్కల అనుమతి లేకుండా నిర్వహించే స్టోన్ క్రషర్స్‌ను సీజ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారీ కాంప్లెక్స్‌లు నిర్మించేటప్పుడు రోడ్లపై కంకర, బిల్డింగ్ మెటీరియల్ వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఆరు మీటర్ల కంటే లోతుగా భూగర్భంలో సెల్లార్లకు తవ్వకాలు చేపడితే నిబంధనల ప్రకారం పన్ను వసూలు చేయాలని ఖనిజ వనరులశాఖను ఆదేశించారు.



పదవీకాలం ముగిసిన రాజ్యసభ సభ్యులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌కర్‌తో వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు

## చారిత్రక ఘటనల్లో భాగస్వామ్యం నా అదృష్టం

- ఇదంతా కేసీఆర్ వల్లే సాధ్యమైంది
- రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు వీడ్కోలు ఉపన్యాసం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడిగా పదవీకాలంలో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పలు ఘటనల్లో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన కేసీఆర్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటానని చెప్పారు. రాజ్యసభలో పదవీకాలం పూర్తయ్యే సభ్యులకు సభ గురువారం వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ఇరవై నెలల తన పదవీకాలంలో అటు పాత పార్లమెంట్, ఇటు కొత్త పార్లమెంట్ భవనాల్లో కూర్చునే అవకాశం దొరకడం ఆనందంగా ఉన్నదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై తమ పార్టీ తరపున మాట్లాడే అవకాశం రావడం చారిత్రక సంఘటనగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీ తాను ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు కావడం మరిచిపోలేనిదని చెప్పారు. కేంద్రం నిధుల మంజూరులో రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ముగ్గురు బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు లింగయ్యయాదవ్, సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియనున్న నేపథ్యంలో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 15 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. నామినేషన్‌ల మొదటి రోజు ఒక్కటి కూడా దాఖలు కాలేదు.

## బీజేపీలో తేలని 'ఎల్పీ' పంచాయితీ

### బడ్జెట్ సమావేశాలు కూడా లీడర్ లేకుండానే

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2024-25 బడ్జెట్ సమావేశాలు మొదలైనా బీజేపీలో ఎల్పీ పీఠం ఎవరిదో ఇంకా తేలలేదు. ఈ కారణంగానే గురువారం అసెంబ్లీలో జరిగిన బీఏసీ సమావేశానికి బీజేపీ హాజరు కాలేకపోయింది. ఎల్పీ పీఠంపై సీనియర్ నేతల మధ్య సఖ్యత కుదరకపోవడంతో రాష్ట్ర నాయకత్వం తలపట్టుకుంటున్నట్టు సమాచారం. ఏదో ఒక నిర్ణయం తీసుకొని లోక్‌సభ ఎన్నికలకు ముందు కొత్త పంచాయితీ తలకెత్తుకోవడం ఎందుకనే ఉద్దేశంలో రాష్ట్ర నాయకత్వం ఉన్నట్టు తెలిసింది. గురువారం బీజేపీ ఎల్పీ నేతను ఎన్నుకుంటారని భావించారు. ఎన్నుకోకపోవడంతో బీఏసీ సమావేశానికి బీజేపీ ప్రతినిధిగా మహేశ్వర్‌రెడ్డి వెళ్లాలని పార్టీ సూచించింది. నిబంధనల ప్రకారం బీఏసీలో పాల్గొనాలంటే పార్టీ అనుమతి పత్రాలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మహేశ్వర్‌రెడ్డి పార్టీ లేఖ తీసుకొని వెళ్లేసరికే బీఏసీ మొదలైపోయింది. మధ్యలో సమావేశంలోకి వెళ్లడం భావ్యం కాదనే ఉద్దేశంతో ఆయన వెనక్కు తిరిగి వచ్చేశారు. రాజాసింగ్‌ను ఒప్పించి ఎల్పీ పదవిని మహేశ్వర్‌రెడ్డికి ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

# 13 వరకు శాసనసభ

### కనీసం 12 రోజులు నడుపాలన్న బీఆర్‌ఎస్

- బీఏసీ సమావేశానికి హరీశ్ హాజరుపై అభ్యంతరం
- కేసీఆర్ కోరినా హరీశ్‌ను బీఏసీకి అనుమతించని స్పీకర్



బీఏసీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాదరావు, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కడియం శ్రీహరి, కూనంనేని సాంబశివరావు, అక్బరుద్దీన్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 13 వరకు కొనసాగనున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ శుక్రవారం జరుగనున్నది. 10న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దానిపై చర్చను 12న చేపట్టనున్నారు. 13న ద్రవ్య వినిమయ బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, బీఆర్‌ఎస్ నుంచి కడియం శ్రీహరి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. శాసనమండలిలో జరిగిన బీఏసీ సమావేశానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నుంచి టీ జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి మహమూద్ అలీ, బీజేపీ నుంచి ఏవీఎన్ రెడ్డి, ఎంఐఎం నేత ఇఫెండీ పాల్గొన్నారు.

### హరీశ్‌రావు బీఏసీకి రావొద్దు

బీఏసీ సమావేశంలో హైడ్రామా నడిచింది. సమావేశానికి తాను హాజరుకాలేకపోతున్నాని, తన బదులుగా పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఏసీ సభ్యుడిగా ఉన్న కడియం శ్రీహరి హాజరవుతారని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బుధవారమే ఫోన్‌చేసి చెప్పారు. ఇందుకు స్పీకర్ కూడా సరే అన్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్పాయి. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. దీనికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గతంలో బీఏసీ సభ్యులు హాజరుకాకుంటే వారి స్థానంలో అదే పార్టీకి చెందిన మరొకరు హాజరయ్యేవారని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో అనేకమార్లు అలా జరిగిందని, ఆ ఉదంతాలను హరీశ్‌రావు స్పీకర్‌కు గుర్తుచేశారు. కావాలంటే ఎంఐఎం నేత అక్బరుద్దీన్‌ను అడిగి తెలుసుకోవచ్చని చెప్పారు. అక్బరుద్దీన్ ఒవైసీ కూడా హరీశ్‌రావు చెప్పింది నిజమేనని ధ్రువీకరించారు. అయినప్పటికీ స్పీకర్.. హరీశ్‌రావును బీఏసీ సమావేశానికి అనుమతించలేదని తెలిసింది. స్పీకర్ తన విచక్షణ అధికారంతో మరో సభ్యుడు సమావేశానికి హాజరయ్యేందుకు నిర్ణయం తీసుకోవచ్చని హరీశ్‌రావు కోరారు. 'మీరు వెళ్లమంటే వెళ్లిపోతా.. బీఏసీకి హాజరు కావద్దు అని చెప్పండి.. బయటకు వెళ్తా' అని హరీశ్‌రావు చెప్పారు. స్పీకర్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో హరీశ్‌రావు బీఏసీ సమావేశానికి హాజరుకాలేకపోయారు. హరీశ్‌రావు బయటకు వెళ్లే వరకు సీఎం రేవంత్‌రెడ్డి బీఏసీ సమావేశానికి హాజరుకాలేదు.

### వాడిగా.. వేడిగానే బీఏసీ సమావేశం

బీఏసీ సమావేశం ప్రారంభంలోనే హరీశ్‌రావు హాజరు విషయమై వాడివేడి చర్చ జరిగింది. సభను మరో ఆరు రోజులు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అనంతరం షెడ్యూల్‌ను వివరించారు. సభను కనీసం 12 రోజులైనా నిర్వహించాలని కడియం శ్రీహరి కోరారు. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరోసారి బీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మాట్లాడుకుందామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# కులగణనపై సభలో చర్చిస్తం!

- కాళేశ్వరంపై విచారణకు సిట్టింగ్ జడ్జిని కేటాయించలేమని హైకోర్టు చెప్పింది
- మీడియాతో చిట్ చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కులగణన చేపట్టే అంశంపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకొంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సిట్టింగ్ జడ్జిని కేటాయించాలని హైకోర్టును కోరితే రిటైర్డ్ జడ్జిని ఇస్తామని చెప్పిందని, ఈ అంశంపై కూడా క్యాబినెట్‌లో, శాసనసభలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గురువారం అసెంబ్లీలో సీఎం మీడియాతో చిట్‌చాట్‌లో పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై శాసనసభలో శ్వేతపత్రం పెడతారా లేదా? అనేది సంబంధిత శాఖ మంత్రి ప్రకటిస్తారని అన్నారు. మేడిగడ్డ మీద చర్చను పక్కదారి పట్టించడానికే కేసీఆర్ కేఆర్‌ఎంబీని తెరమీదికి తెచ్చారని విమర్శించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలు కేసీఆర్‌ను, ఆయన పార్టీని తిరస్కరించారని తెలిపారు.

### కేసీఆర్ సభలో ఉండాలి

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయన దగ్గరికి వెళ్లి కలిస్తే జరగని చర్చ, ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తనను కలిస్తే ఎందుకు వస్తున్నదని రేవంత్ ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభలో ఉండాలని కోరుకుంటున్నానని, ఆయన వస్తే తానే వెళ్లి కలుస్తానని స్పష్టం చేశారు. తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీఏసీ సమావేశానికి కేసీఆర్, కడియం శ్రీహరి వస్తారని స్పీకర్‌కు ఆ పార్టీ లెటర్ ఇచ్చిందని, తర్వాత కేసీఆర్ స్థానంలో హరీశ్‌రావు వస్తానంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా పదేండ్లు పనిచేసిన హరీశ్‌రావుకు ఆ మాత్రం తెలియదా? అని ప్రశ్నించారు. సోనియాగాంధీని లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరామని, తన నిర్ణయాన్ని తర్వాత చెప్తానని ఆమె బదులిచ్చారని వెల్లడించారు. ప్రతిపక్ష నేతకు అసెంబ్లీలో చాంబర్ కేటాయింపు అంశం స్పీకర్ పరిధిలోనిదని పేర్కొన్నారు. చాంబర్ ఇవ్వాలి కనుక ఇచ్చాం.. కానీ ఇక్కడే ఇవ్వాలని లేదు అని వ్యాఖ్యానించారు.

### రేవంత్‌ను కలిసిన పట్నం దంపతులు

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి గురవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు.

### రాజాసింగ్‌తో సీఎం ప్రత్యేక కరచాలనం

అసెంబ్లీలో గురువారం ఆసక్తికర దృశ్యం కనిపించింది. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కరచాలనం చేయడం ఆసక్తికరంగా మారింది. గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించుకొని వెళ్తున్న సమయంలో రేవంత్‌రెడ్డి కూడా సభా సంప్రదాయాన్ని అనుసరించి మర్యాదపూర్వకంగా ఆమె వెంట నడిచారు. అయితే సభ చివరలో ఉన్న రాజాసింగ్ గవర్నర్‌కు నమస్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ వెనకాల ఉన్న రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా రాజాసింగ్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చారు. మిగిలిన సభ్యులకు నమస్కరించుకుంటూ వెళ్లిన సీఎం.. రాజాసింగ్ ఒక్కరికి మాత్రం షేక్‌హ్యాండ్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.


